

నేడే పింఛన్ల పండుగ

ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీకి ఏర్పాట్లు పూర్తి.. పాల్గొననున్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు

అనంతపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు ముందు టీడీపీ అధినేతగా చంద్రబాబునాయుడు ఇచ్చిన పింఛన్ సొమ్ము పెంపు హామీ సోమవారం నెరవేరనుంది. పెంచిన పింఛన్ల సొమ్ము పంపిణీ కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 6 గంటలకే లబ్ధిదారుల ఇంటి ముంగిటకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల సొమ్ముతోపాటు ఏప్రిల్, మే, జూన్ మాసాలకు సంబంధించి రూ.1000 చొప్పున కలిపి మొత్తం రూ.ఏడు వేలు అవ్వాతాతలకు ఇవ్వనున్నారు. పెంచిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఇదివరకు ఎన్నడూ లేని విధంగా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కూటమి నేతలు, ఆయా పార్టీల శ్రేణులు భాగస్వాములు కానున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారాలోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసేందుకు పార్టీ శ్రేణులు సిద్ధమయ్యాయి. జిల్లాలోని 8 నియోజకవర్గాల్లోనూ పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించేందుకు కూటమి నేతలు సిద్ధమయ్యారు. జిల్లాలోని మంత్రులు, ఆయా నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యులు కానున్నారు.

2,89,508 మంది లబ్ధిదారులకు రూ.197.44 కోట్లు


జిల్లాలో 289508 మంది లబ్ధిదారులకు రూ.197.44 కోట్ల పింఛన్ పంపిణీకి జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ నేతృత్వంలో పంపిణీకి సంబంధించి ప్రణాళికలు రూపొందించారు. వృద్ధాప్య పింఛన్ లబ్ధిదారులు 144396 మంది ఉండగా వారికి పెంచిన పింఛన్ సొమ్ముతో రూ.101.077 కోట్లు చెల్లించనున్నారు. 66749 మంది వితంతువులకు రూ.46.72 కోట్లు, 6759 మంది చేనేత కార్మికులకు రూ.4.73 కోట్లు, 354 మంది కల్లుగీత కార్మికులకు రూ.24 లక్షలు, 890 మంది మత్స్యకారులకు రూ.62 లక్షలు, 6737 మంది ఒంటరి మహిళలకు రూ.4.71 కోట్లు, 3525 మంది చర్మకారులకు రూ.2.46 కోట్లు, 207 మంది హిజ్రాలకు రూ.14 లక్షలు, 2476 మంది హెచ్‌ఐవీ బాధితులకు రూ.1.73 కోట్లు, 3137 మంది డప్పుకళాకారులకు రూ.2.19 కోట్లు, 185 మంది కళాకారులకు రూ.13 లక్షలు చెల్లించనున్నారు. దివ్యాంగులకు రూ.3వేలుగా ఉన్న పింఛన్‌ను రూ.6వేలకు పెంచారు. ఈ నేపథ్యంలో 46351 మంది దివ్యాంగులకు రూ.27.81 కోట్లు, 391 మంది కృష్ఠు బాధితులకు రూ.23 లక్షలు చెల్లించనున్నారు. నడవలేని స్థితిలో ఉన్న పూర్తి స్థాయి దివ్యాంగుల పింఛన్‌ను రూ.5వేల నుంచి రూ.15వేలకు పెంచారు. ఈ క్రమంలో జిల్లాలోని 1444 మంది లబ్ధిదారులకు రూ.2.16 కోట్లు, 1091 మంది ప్రమాద బాధితులకు రూ.1.63 కోట్లు చెల్లించనున్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల పింఛన్‌ను రూ.5వేల నుంచి రూ.10వేలకు పెంచారు. ఆ మేరకు జిల్లాలోని 19 మందికి రూ.1.9 లక్షలు, 83 మంది కిడ్నీ, లివర్, గుండె మార్పిడి బాధితులకు రూ.8.3 లక్షలు, 22 మంది సీకేడీ సంబంధిత బాధితులకు రూ.2.2 లక్షలు, 281 మంది డయాలసిస్ బాధితులకు రూ.28.10 లక్షలు, 10 మంది సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు రూ.లక్ష, 125 మంది థలసీమియా బాధితులకు రూ.12.5 లక్షలు, 49 మంది హిమోఫీలియా బాధితులకు రూ.4.9 లక్షలు, ఆరుగురు సైనిక్ వెల్ఫేర్‌లకు రూ.5వేలు చొప్పున రూ.30వేలు, 4221 మంది అభయ హస్తం లబ్ధిదారులకు రూ.500 చొప్పున రూ.21.10 లక్షలు అందజేయనున్నారు. మొత్తం మీద 289508 మంది వివిధ రకాల పింఛన్‌దారులకు రూ.197.44 కోట్లు పంపిణీ చేయనున్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు... పెంచిన పింఛన్ రూ.4వేలతోపాటు బకాయి రూ.3వేలు కలిపి రూ.7వేలు పంపిణీ చేస్తున్న నేపథ్యంలో అదనంగా రూ.70.62 కోట్లు లబ్ధిదారులకు అందనుంది.

ఇంటి వద్దే పింఛన్: డీఆర్‌డీఏ పీడీ



ఎన్టీఆర్ భరోసా పింఛన్ లబ్ధిదారులకు సీఎం రాసిన లేఖను విడుదల చేస్తున్న డీఆర్‌డీఏ పీడీ, ఉద్యోగులు

అనంతపురం క్లాక్‌టవర్: ఇంటివద్దనే ఎన్టీఆర్ భరోసా పింఛన్ అందజేయడానికి ఏర్పాట్లు పూర్తి చేశామని డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పింఛన్ లబ్ధిదారులకు రాసిన లేఖను ఆదివారం స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయంలో పీడీ ఈశ్వరయ్య విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల అమలులో భాగంగా ఈనెల ఒకటోతేదీన ఇంటివద్దనే లబ్ధిదారులకు పింఛన్ అందజేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 12వేల క్లస్టర్లలో మ్యాపింగ్ ఆధారంగా ఒక్కరోజులోనే పింఛన్ పంపిణీ పూర్తి చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ డీపీఎంలు, ఏపీఎంలు పాల్గొన్నారు.



పింఛన్ల పండుగలో పాల్గొనండి

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

అనంతపురం అర్బన్: జిల్లా వ్యాప్తంగా సోమవారం జరిగే పింఛన్ల పండుగ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌ను రూ.4వేలకు పెంచారన్నారు. బకాయిలతో కలిపి సోమవారం ఒక్కో పింఛన్‌దారుడికి రూ.ఏడువేలు అందజేస్తారన్నారు.

సర్వం సిద్ధం

- 2,89,508 మందికి రూ.197.44 కోట్ల పింఛన్
- ఒక్కరోజే వందశాతం పంపిణీకి ఏర్పాట్లు
- కలెక్టరు వినోద్‌కుమార్



అనంతపురం టౌన్, జూన్ 30: ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం సామాజిక పింఛన్ల పంపిణీకి జిల్లాలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. పింఛన్ల పంపిణీపై ఆదివారం కలెక్టరేట్‌లో ఆయన మీడియాతో మాట్లాడా రు. జిల్లాలో ఈనెల నుంచి 11రకాల పింఛన్లకు సంబంధించి ముఖ్యమంత్రి ప్రకటించిన మేరకు మూడునెలల అరియర్స్‌తో కలిపి నగదు అందజేస్తామన్నారు. జిల్లాలో 11 రకాల పింఛన్లకు సంబంధించి 2,89,508మంది లబ్ధిదారులు ఉన్నారన్నారు. వీరిలో గతంలో రూ.3వేలు తీసుకుంటున్న వారికి రూ4వేలు, పూర్తిగా దివ్యాంగులకు రూ.5వేల నుంచి 15వేలకు పెంచిన సొమ్మును సోమవారం పంపిణీ చేస్తారన్నారు. ఉదయం 6గంటలనుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభమవుతుందన్నారు. లబ్ధిదారుల ఇళ్లవద్దకే వెళ్లి పింఛన్ అందజేస్తారన్నారు. లబ్ధిదారులు వారి చిరునామాలో ఉదయం 6గంటల నుంచే అందుబాటులో ఉండాలని కలెక్టరు కోరారు. సోమవారం ఒక్కరోజే వందశాతం పింఛన్ల పంపిణీ చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. 2,89,508 లబ్ధిదారులకు రూ.197.44కోట్లు పంపిణీ చేస్తామన్నారు. ప్రతి 50ఇళ్లకు గ్రామ, మండల స్థాయిలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులను క్లస్టర్ మ్యాపింగ్ చేసినట్లు వెల్లడించారు. పింఛన్ డబ్బులు తీసుకున్న లబ్ధిదారులు అక్నాలెడ్జ్‌మెంట్‌పై సంతకం లేదా వేలిముద్రలు వేయాల్సి ఉంటుందన్నారు.



నీటిని సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్న ట్యాంకర్లు

ఉరవకొండకు ట్యాంకర్లతో నీటి సరఫరా

ఉరవకొండ, జూన్ 30: పట్టణంలో ట్యాంకర్లతో తాగు నీటి సరఫరా మూడు రోజుల నుంచి కొనసాగుతోంది. నెలరోజులైనా కుళాయిలకు నీటి సరఫరా జరగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. దీంతో సమస్య పరిష్కరించాలని ఆర్థికశాఖామంత్రి పయ్యావుల కేశవ్ జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్‌ను ఆదేశించారు. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టణంలో నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో 21ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఒక్కో ట్యాంకర్ రోజుకు ఐదు ట్రిప్పుల చొప్పున అన్ని వార్డులకు సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి రేషన్ పంపిణీ: జేసీ

అనంతపురం టౌన్, జూన్ 30: జిల్లాలో రేషన్‌కార్డు లబ్ధిదారులందరికీ సోమవారం నుంచి రేషన్ పంపిణీ చేస్తామని జాయింట్ కలెక్టరు కేతన్‌గార్గ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్‌కార్డుదారులందరికీ ప్రతి సభ్యుడికి 5 కిలోల బియ్యం, అంత్యోదయ కార్డుదారులందరికీ 35కేజీల బియ్యం అందజేస్తారన్నారు. లబ్ధిదారులు కావాలనుకుంటే బియ్యానికి బదులు మూడు కేజీల వరకు రాగులు, జొన్నలు ఇస్తామన్నారు. ఎండీయూ వాహనాల ద్వారానే ఇళ్లవద్దకే వచ్చి సరుకులు పంపిణీ చేస్తారని, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని జేసీ ఆదేశించారు.

పీఆర్ ఎస్ఈగా కేవీకేవీ ప్రసాద్



కేవీకేవీ ప్రసాద్

అనంతపురం సిటీ, జూన్ 30: జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ ఇన్‌చార్జి ఎస్ఈ (ఎఫ్ఏసీ)గా ఆశాఖ పీఐయూ ఈఈగా పనిచేస్తున్న కేవీకేవీ ప్రసాద్‌ను నియమిస్తూ ఆశాఖ ఈఎన్‌సీ బాలూనాయక్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో కేవీకేవీ ప్రసాద్ ఆశాఖ ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆశాఖలోని పలువురు ఈఈలు, డీఈఈలు ఇతర ఉద్యోగులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇదివరకు ఎస్ఈగా పనిచేస్తున్న ఈరాస్వామి శనివారం ఉద్యోగ విరమణ పొందిన విషయం తెలిసిందే. కాగా.. పీఐయూ ఈఈగా పనిచేస్తూనే.. ఆశాఖ ఎస్ఈగా కూడా బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బొప్పాయిచెట్ల నరికివేత

దాదాపు రూ.రెండు లక్షల నష్టం



నరికిన బొప్పాయి చెట్లను పరిశీలిస్తున్న రైతు సంఘం అధ్యక్షుడు చల్లా శ్రీనివాసులు తదితరులు

అనంతపురంరూరల్, జూన్ 30: మండలంలోని మన్నీల గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు శనివారం రాత్రి ఓ రైతు సాగు చేసిన బొప్పాయి చెట్లు నరికివేశారు. బత్తపల్లి మండలం ఎర్రాయిపల్లికి చెందిన వెంకటరాముడు మన్నీల గ్రామ పొలం సర్వే నెంబరు 47లోని 4.8 ఎకరాల్లో ఉన్న భూమిలో బొప్పాయి పంట సాగు చేశాడు. ఆరు నెలల కిందట దాదాపు రూ.ఏడు లక్షల పెట్టుపెట్టి ఐదు వేల మొక్కలు నాటాడు. పంటకూడా చేతికొచ్చే దశలో ఉంది. మరో ఇరవై రోజుల్లో పంట కోత కోయాల్సి ఉంది. అయితే శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు 500 చెట్ల నరికివేశారు. దీంతో దాదాపు రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ఈ విషయం తెలుసుకున్న ధర్మవరం నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షుడు చల్లా శ్రీనివాసులు, పలువురు రైతులతో కలిసి పొలాన్ని పరిశీలించారు. రైతుతో కలిసి ఇటుకలపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ రైతుల పట్ల ఇంత రాక్షసంగా వ్యవహరించిన దుండగులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, రైతులు జయప్ప, నాయుడు, స్టోర్ నాయుడు, చల్లా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్ దృష్టికి డీఎస్సీ-96 అభ్యర్థుల సమస్యలు

అనంతపురం విద్య, జూన్ 30: తమ సమస్యలు పరిష్కరించాలని మంత్రి నారా లోకేశ్‌ను అమరావతిలో కలిసినట్లు డీఎస్సీ-1996 అభ్యర్థులు ఆదివారం పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 135 మంది వరకూ డీఎస్సీ-96 అభ్యర్థులు ఉన్నామని, తమకు కూడా మినిమం టైం స్కేల్ ఇచ్చి, ఉపాధ్యాయ ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరామన్నారు. కార్యక్రమంలో షేక్ వలి, డీఎల్‌రావు, అంజనేయులు, సుబ్బారావు, మల్లికార్జునరావు, ఎండీ గౌస్, నాగేశ్వర్‌రావు, నందకుమార్, తిప్పేస్వామి, వాసు, శేఖర్ పాల్గొన్నారు.

ఆటశాల..!





గ్రిల్ ఏర్పాటు ఇలా..

క్రికెట్ నెట్స్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం



వ్యాయామం చేసుకోవడానికి ఏర్పాటు చేసిన పరికరాలు



- ఆ పాఠశాలలో అన్ని క్రీడలకు అవకాశం
- దాతల సహకారంతో క్రీడాభివృద్ధి పనులు
- జాతీయ, అంతర్జాతీయ పోటీల్లోనూ రాణించిన విద్యార్థులు
- పూర్వ విద్యార్థుల సహకారంతో పీడీ కృషి

బెళుగుప్ప, జూన్ 30: అది చదువులు చెప్పే పాఠశాల మాత్రమే కాదు.. ఎందరో క్రీడాకారులను తయారు చేసే ఆటశాలగా చెప్పవచ్చు. బెళుగుప్ప మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో దాతల సహకారంతో చేపట్టిన క్రీడాభివృద్ధి పనులు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. గతంలో ఈ పాఠశాల విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో సైతం రాణించారు. విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి ఉన్నా సౌకర్యాలు కరువై దూరంగా వున్నారు. వారిలో క్రీడానైపుణ్యాన్ని గమనించిన పీడీ రాజశేఖర్ చొరవ తీసుకుని క్రీడాభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. పాఠశాల పరిస్థితిని పూర్వ విద్యార్థుల దృష్టికి తీసుకెళ్లి వారి సహకారంతో విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పాఠశాల మైదానంలోకి వెళ్లగానే లక్షలాది రూపాయల క్రీడా సామగ్రి దర్శనమిస్తాయి. విద్యార్థులు ఆసక్తి ఉన్న ఏ ఆటనైనా ఆడడానికి ఏర్పాట్లు చేశారు. లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన క్రికెట్ నెట్, సాఫ్ట్‌బాల్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ కోర్టులు, కబడ్డీ, ఖోఖో, జూడో తదితర క్రీడలు ఆడుకునేలా సౌకర్యాలు కల్పించడానికి పీడీ చర్యలు తీసుకున్నారు. వీటితోపాటు పాఠశాల గ్రీన్‌కో పూర్వ విద్యార్థుల సహకారంతో రూ.3లక్షలతో ప్రధాన గేట్, గ్రిల్ నిర్మిస్తున్నారు.





క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే ధ్యేయం
● రాజశేఖర్, పీడీ

విద్యార్థులకు అనుకూలంగా మరింత ఆటస్థలం లేదు. ఈ పాఠశాలలో 400 మందికి పైగా విద్యార్థులు వుంటున్నారు. క్రీడల పట్ల ఆసక్తి ఉన్నా ఆట స్థలం లేదు. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని గుర్తించి వారిని తీర్చిదిద్దుతున్నాం. ఆడుకునేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించడానికి ఎంతో మంది దాతలు ముందుకొస్తున్నారు. ప్రజల సహకారముంటేనే ఏదైనా అభివృద్ధి సాధ్యమవుతుంది.



దాతల సహకారం మరువలేనిది..
వెంకటప్రసాద్, హెచ్ఎం

పాఠశాలలో క్రీడాభివృద్ధికి దాతల సహకారం మరువలేనిది. పూర్వ విద్యార్థులు, గాలిమరల కంపెనీలు స్వచ్ఛందంగా ఆర్థిక సహాయం అందించడానికి ముందుకురావడం అభినందనీయం.

బోల్తా కొట్టిన బీర





సాగు చేసిన బీర పంట

- ఊరించి.. ఉసూరుమనిపించిన ధరలు ● మొన్నటివరకు రూ.40.. నేడు రూ.13..
- అమాంతం పడిపోయిన వైనం ● పంట చేతికొచ్చే వేళ రైతుకు తప్పని ఆవేదన
- కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా 250 ఎకరాల్లో సాగు

కళ్యాణదుర్గం, జూన్ 30: కష్టించి సాగు చేసిన పంటలు తీరా చేతికొచ్చే వేళ ధరలు పడిపోతుండంతో అన్నదాతల అవస్థలు అంతా ఇంతా కాదు. బీరకాయి కేజీ ధర మొన్నటివరకు రూ.40 వరకు పలికింది. అన్నదాత సంతోషం నాలుగు రోజుల్లోనే ఆవిరైపోయింది. ఒక్కసారిగా బీర ధరలు అమాంతం పడిపోయాయి. కేజీ బీరకాయల ధర రూ.13కు పడిపోవడంతో అన్నదాత అయోమయంలో పడ్డారు. ఎకరాకు రూ. 1.50 లక్షల నుంచి రూ. 2 లక్షలు వెచ్చించి బీర పంటను సాగు చేశారు. కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం రూరల్ మండలాల్లో బీర పంటను అధికంగా సాగు చేశారు. దాదాపు 250 ఎకరాల్లో బీర పంటను సాగు చేశారు. సుమారు రూ. 3 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టారు. చివరికి ధరలు పడిపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. 20 రోజుల క్రితం వర్షాలకు తట్టుకుని, ఎంతో వ్యయప్రయాసాలతో మందులను పిచికారి చేసి వర్షానికి సైతం పంటను కాపాడుకున్నారు. అంతలా శ్రమించిన రైతులకు ధరలు పడిపోవడంతో కనీసం పెట్టుబడులు కూడా చేతికందడం లేదని వాపోతున్నారు. 40 రోజులపాటు కంటికి రెప్పలా పంటను కాపాడుకుంటూ వచ్చారు. అధిక దిగుబడులు వచ్చినా.. ధరతో రైతులు నట్టేట మునిగారు. కనీసం రూ.20 నుంచి రూ.25వరకు ధర పలికినా పెట్టుబడి కాస్తో, కూస్తో వచ్చే అవకాశాలు ఉన్నాయి. రూ.13కి ధర పడిపోవడంతో పెట్టుబడి కూడా దక్కడం లేదని అన్నదాత ఆందోళన చెందుతున్నారు. ఖమ్మం, కరీంనగర్, హైదరాబాద్ పట్టణాలకు సైతం బీరకాయను బాక్సుల్లో పెట్టి తరలించినా, రవాణా ఖర్చులకే సరిపోతుందే తప్ప.. రైతుకు ఉపయోగం లేదు. ఏ పంట పెట్టాలన్నా రైతులు భయపడే పరిస్థితి నెలకొంది. తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలో అని రైతులు వాపోతున్నారు.



నాలుగెకరాల్లో సాగు చేసి నష్టపోయా..
శ్రీనివాసులు, రైతు, ఒంటారెడ్డిపల్లి

నాలుగు ఎకరాల్లో బీర పంటను సాగు చేశాను. 20 రోజుల క్రితం రూ.40 వరకు కేజీ ధర పలికింది. నేడు రూ.13కు పడిపోవడం బాధాకరం. ఈ ధరతో అమ్మితే కనీసం పెట్టుబడులు కూడా రావు. ఏ పంట పెట్టాలన్నా ధరల తగ్గుదలతో వెనుకడుగు వేసే పరిస్థితి ఉంది. ఇలాగే ఉంటే సాగు చేయలేకపోతాం.



పెట్టుబడులు కూడా రావు
: విజయకుమార్, రైతు, ఒంటారెడ్డిపల్లి

అమాంతంగా బీర ధర తగ్గడంతో పెట్టుబడులు కూడా రావు. మూడు ఎకరాల్లో బీర సాగు చేశారు. దిగుబడి బాగానే ఉన్నా, ధరలతో నట్టేట మునిగాం. సాగు చేసిన మొదల్లో బాగానే ధరలు ఉన్నప్పటికీ, కోతకు వచ్చిన సమయంలో ధర పడిపోయింది. మార్కెట్‌కు తరలించినా రవాణా ఖర్చులకు కూడా సరిపోదు.



బాక్సుల్లోకి నింపిన బీరకాయలు

డయేరియా కట్టడికి చర్యలు

అనంతపురం టౌన్ జూన్ 30: జిల్లాలో అతిసార వ్యాధిని కట్టడికి 'స్టాప్ డయేరియా' పేరుతో సోమవారం నుంచి నెల రోజుల పాటు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ ఈ.బీ.దేవి ఆదివారం తెలిపారు. గ్రామస్థాయిలో పర్యటిస్తూ అతిసారపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఇక ప్రతి ఆస్పత్రిలోను రాపిడ్ రెస్పాన్స్ టీమ్ ఉంటుందని, బాధితులు ఆస్పత్రికి వస్తే వారికి వెంటనే వైద్యసేవలు అందుతాయని తెలిపారు. బాధిత కుటుంబాలు, పరిసర ప్రాంతంలో అతిసార ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలలు, హాస్టల్స్ అంగన్‌వాడీ కేంద్రాలను అధికారులు, సిబ్బంది సందర్శిస్తూ వారికి అతిసారపై అవగాహన కల్పిస్తామన్నారు. డయేరియా కేసులు పూర్తిగా తగ్గేవరకు వైద్యశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు.

రూ.11 లక్షల నగదుతో వీహెచ్ఏ పరారీ

కుందుర్పి, జూన్ 30: మండలంలోని జంబుగుంపల రైతు భరోసా కేంద్రంలో వీహెచ్ఏగా పనిచేస్తున్న ప్రవీణ్ రాయితీ విత్తనాలు విక్రయించిన రూ.11,23,420సొమ్ముతో పరారయ్యాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో ఆదివారం మండల వ్యవసాయ అధికారి స్థానిక కుందుర్పి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వ్యవసాయ అధికారి తెలిపిన మేరకు జంబుగుంపల గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో 300 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కాయలను రైతులకు పంపిణీ చేశారు. అందుకు సంబంధించిన నగదును రూ.17,23,420 విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రవీణ్ ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. అందులో రూ.5.9 లక్షలు మాత్రమే చెల్లించాడు. మిగిలిన సొమ్మును జమ చేయలేదు. 15 రోజులుగా అతను అందుబాటులోకి రాకపోవడంతో వ్యక్తిగత సమస్యలతో సెలవులో ఉన్నారని అధికారులు భావించారు. ఫోన్ చేసినా అందుబాటులోకి రాకపోవడంతో అనుమానంతో మండల వ్యవసాయ అధికారి మహేష్ అప్రమత్తమై ఎస్ఐ వెంకటస్వామికి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మేనమామను హతమార్చిన అల్లుడు

కళ్యాణదుర్గంరూరల్, జూన్ 30: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని మామను మైనరైన అల్లుడు హత్య చేసినట్లు పట్టణ సీఐ హరినాథ తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో హత్య వివరాలను సీఐ వెల్లడించారు. మున్సిపల్ పరిధిలోని కురాకులతోట సమీపంలో శుక్రవారం సాయంత్రం చెలిగొత్తుల కొండ వద్ద రక్తపుమడుగులో ఉన్న మృతదేహాన్ని చూసిన పశువుల కాపరులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించగా మృతిచెందిన వ్యక్తి కురాకులతోట గ్రామానికి చెందిన వన్నూరుస్వామిగా గుర్తించారు. 24 గంటల్లోనే కేసును ఛేదించారు. వన్నూరుస్వామి అల్లుడే హత్య చేసినట్లు విచారణలో తేలింది. పథకం ప్రకారమే ద్విచక్రవాహనంలో చెలిగొత్తుల కొండకు తీసుకెళ్లి పూటుగా మద్యం తాగించి, వెంట తెచ్చుకున్న సూరకత్తితో గొంతుకోసి హత్య చేసినట్లు సీఐ తెలిపారు. ఆదివారం మారుతి వేబ్రిడ్జి వద్ద ఉన్న ఆ బాలుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ హరినాథ

విమర్శలెన్నొచ్చినా.. వెనకేసుకొస్తాం..!



జడ్పీ కార్యాలయం

- ఏడాదిలో లెక్కలేనన్ని ఆరోపణలు
- 2023 జూన్, జూలైలో అడ్డదారిలో జీతాలు డ్రా
- విచారణకు ఆదేశించిన పీఆర్ కమిషనర్
- తొక్కిపెట్టిన జడ్పీ ఉన్నతాధికారులు
- జడ్పీ డిప్యూటీ సీఈఓపై చర్యలు శూన్యం


అనంతపురం విద్య, జూన్ 30: విమర్శలు ఎన్ని వచ్చినా... వెనకేసుకొస్తారు. జడ్పీటీసీలను హేళన చేసినా.... ఆఖరికి పాలకవర్గం వద్దని చెప్పినా...పెద్దపీట వేస్తారు. ఇటీవల జడ్పీటీసీలు, ఎంపీపీలు సాక్షాత్తు స్టాండింగ్ కమిటీలోనే సరెండర్ చేయాలని పట్టుబట్టినా....పక్కనబెట్టేస్తారు. ఇష్టారాజ్యంగా జీతాలు, అలవెన్సులు డ్రా చేస్తే... సాక్షాత్తు.. పంచాయతీ రాజ్ కమిషనర్ సైతం విచారణకు ఆదేశించినా... పట్టించుకోరు. విచారణను తొక్కి పెట్టేస్తారు. లోకాయుక్తాకు ఫిర్యాదులు వెళ్లినా... పక్కపెట్టేస్తారు. ఆమె జడ్పీకి వచ్చిన ఏడాది కాలంలో అనేక విమర్శలు, ఆరోపణలు...అయినా...చర్యలు తీసుకోవడంలో మాత్రం మీనమేషాలు. జడ్పీ డిప్యూటీ సీఈఓ లలితా భాయిని జడ్పీ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టరేట్ వర్గాలు వెనకేసుకు రావడంపై అనేక ఆరోపణలు వస్తున్నాయి.

ఐదు నెలల కిందటే విచారణకు ఆదేశాలు...

సుమారు ఏడాది కిందట డిప్యూటీ సీఈఓ లలితాబాయి జడ్పీకి వచ్చారు. కర్నూలు జిల్లాలో పనిచేస్తున్న ఆమె ఈ జిల్లాకు బదిలీపై వచ్చారు. అయితే ఆమె చేరికపై అనేక విమర్శలు వచ్చాయి. అప్పటి సీఈఓ భాస్కర్‌రెడ్డి డిప్యూటీ సీఈఓ విధుల్లో చేరిక, పంచాయతీరాజ్ కమిషనర్‌కు పంపిన రిపోర్ట్‌పై అనేక విమర్శలు వచ్చాయి. డిప్యూటీ సీఈఓ విధుల్లో చేరిన తేదీలకు, జీతాలు, ఇతర అలవెన్సులు డ్రా చేసిన దానికి పొంతన లేకపోవడంతో....ఆమెపై ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో సుమారు 5 నెలల కిందట ఆమెపై విచారణ చేయాలంటూ...పీఆర్ కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు. 2023 జూన్, జులై జీతాల, ఇతర అలవెన్సులు డ్రా చేయడంపై విచారణ చేయాలంటూ.....అనంతపురం జిల్లా కలెక్టర్‌ను ఆదేశిస్తూ...పీఆర్ కమిషనర్ సూర్యకుమారి ఉత్తర్వులు ఇచ్చారు. అప్పటి కలెక్టర్ గౌతమి ఈ అంశాన్ని పూర్తిగా పక్కనబెట్టారంటూ అప్పట్లో జోరుగా ప్రచారం సాగింది. నామమాత్రంగా విచారణ చేయాలన్నట్టుగా అప్పట్లో జడ్పీ సీఈఓను ఆదేశించినట్టు తెలుస్తోంది. అయితే ఐదు మాసాలు గడిచినా...ఇంత వరకూ ఈ అంశంలో పురోగతి లేదు.

లోకాయుక్తాకు ఫిర్యాదు...

జడ్పీ పరిధిలో ఇష్టారాజ్యంగా బిల్లులు చేయడంపై లోకయుక్తాకు ఫిర్యాదులు వెళ్లాయి. గతంలో పలువురు వైకాపా ఎమ్మెల్యేలు, వారి అనుయాయులకు సంబంధించిన సంస్థలకు గతంలో ఎడాపెడా బిల్లులు చేశారు. ఓ అండ్ ఎం బిల్లులను ఏ మాత్రం నిబంధనలు పాటించకుండా చెల్లింపు చేశారు. కోట్ల రూపాయల బిల్లులు చెల్లింపులు జరిగాయి. అప్పటి కొందరు వైకాపా ఎమ్మెల్యేలు, వారి అనుచరులకు సంబంధించిన సంస్థలు... తాగునీటి శుద్ధి కేంద్రాల్లో పనిచేసే కార్మికుల జీతాలు, పీఎఫ్, ఈఎస్ఐలో అనేక గోల్‌మాల్ వ్యవహారాలు నడిపాయి. వీటిపై విచారణ జరుగుతోంది. అయితే విచారణ పూర్తికాకుండానే...అడ్డగోలుగా కోట్ల రూపాయల బిల్లులు చెల్లింపు జరిగాయి. ఈ వ్యవహారంలో కూడా జడ్పీ డిప్యూటీ సీఈఓపై లోకాయుక్తాకు ఫిర్యాదులు వెళ్లాయి. ఇలా ఏడాది కాలంలో జడ్పీ డిప్యూటీ సీఈఓపై అనేక విమర్శలు, ఆరోపణలు వచ్చినా....జడ్పీ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టరేట్ వర్గాలు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వచ్చాయి. ప్రభుత్వం మారినా... చర్యలు తీసుకోకపోవడం చూస్తుంటే... ఉన్నతాధికారుల వైఖరేంటో...ఇట్టే అర్థమవుతోంది. ఇప్పటికైనా విచారణ వేగవంతం చేస్తారా..? తొక్కిపెడతారేమో చూడాలి.



విచారణ చేయాలని పీఆర్ కమిషన్ ఇచ్చిన ఉత్తర్వులు

ఉద్యోగ భద్రత కల్పించాలి

- ఎంపీఈఓల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు

అనంతపురం అర్బన్, జూన్ 30: వ్యవసాయ శాఖలో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న ఎంపీఈఓలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు కోరారు. అనంతపురంలోని ఓ ప్రైవేటు కళాశాల సమావేశపు హాల్‌లో ఆదివారం ఎంపీఈఓల సంఘం జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడారు. ఎంపీఈఓలకు ఎంటీఎస్‌గానీ, హెచ్ఆర్ పాలసీతో రూ.35వేల వేతనం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి 1500 హెక్టార్లకు ఒక ఎంపీఈఓను నియమించి, అందరికీ న్యాయం చేయాలన్నారు. చిత్తూరు జిల్లాలో ఓడీపై పనిచేస్తున్న అనంత జిల్లాకు చెందిన ఎంపీఈఓలను తిరిగి జిల్లాలో పోస్టింగ్ ఇప్పించాలన్నారు. ఓడీపై వెళ్లకపోవడంతో టర్మినేట్ చేసిన వారికి తిరిగి ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. ఏటా ఆలస్యంగా రెన్యూవల్ చేయడంతోపాటు సకాలంలో వేతనాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంజిన్‌రెడ్డి, ఎంపీఈఓల సంఘం జిల్లా అధ్యక్షుడు రవి, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల ఖర్చు తుది అకౌంట్స్ సమర్పించండి

- అభ్యర్థులు, పార్టీలకు వ్యయ పరిశీలకుల సూచన

అనంతపురం టౌన్, జూన్30: సార్వత్రిక ఎన్నికలలో పోటీచేసిన అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల వ్యయ ఖర్చుకు సంబంధించిన తుది అకౌంట్స్ వివరాలను అందించాలని కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకులు విలాస్ వి, షిండే, నితిన్‌అగర్వాల్, రాందాస్ టి, కాలే సూచించారు. ఆదివారం కలెక్టరేట్‌లో పోటీచేసిన అభ్యర్థులు, రాజకీయపార్టీల ప్రతినిధులతో వారు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పరిశీలకులు మాట్లాడుతూ ఎన్నికలు జిల్లాలో ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అభ్యర్థుల ఖర్చుల అకౌంట్ బుక్స్, రికార్డులు,రిజిష్టర్లను డీఈఎంసీకి సమర్పించాల్సి ఉంటుందన్నారు. జూలై 3వ తేదీలోగా ఈప్రక్రియ పూర్తి కావాలన్నారు. ఏదైనా అభ్యంతరాలు, అనుమానాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. రిజిష్టర్లు, ఈసందర్భంగా కలెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో చివరిఘట్టానికి చేరుకున్నామన్నారు. కౌంటింగ్ ప్రక్రియ ముగిసిన నెలరోజుల లోగా ఖర్చుల వివరాలు అందించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీసీఓ అరుణకుమారి, ఆర్డీఓలు గ్రంధి వెంకటేష్, శ్రీనివాసులు రెడ్డి, శిరీషా, పోటీచేసిన అభ్యర్థులు, రాజకీయపార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకులు విలాస్ వి, షిండే తదితరులు

జాతీయ రెఫరీలుగా జిల్లా కోచ్‌లు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 30: జాతీయ తైక్వాండో రెఫరీలుగా(అంపైర్లు) జిల్లాకు చెందిన కోచ్‌లు మునీంద్ర, నవీన్‌చంద్రలు అర్హత సాధించారు. జూన్ నెల 28, 29వతేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించిన రెఫరీల ఎంపిక పోటీల్లో వీరు ఈ అర్హత సాధించారు. జిల్లా తైక్వాండో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపాల్‌రెడ్డి, గురుస్వామి, కార్యనిర్వాహక కార్యదర్శి శాంతరాజ్‌లు వారికి అభినందనలు తెలిపారు.



మునీంద్ర, నవీన్‌చంద్ర

మహిళ ఆత్మహత్య

అనంతపురం క్రైం, జూన్30: భర్త, అత్త వేధింపులు భరించలేక మహిళ ఆత్మహత్య చేసుకుంది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన మేరకు... శ్రీనివాసనగర్‌కు చెందిన రామకృష్ణ బార్బర్ షాపు నిర్వహిస్తున్నాడు. ఇతనికి ఎనిమిది నెలల క్రితం బళ్లారికి చెందిన పవిత్ర(19)తో వివాహమైంది. కొంతకాలంగా భర్త, అత్త లక్ష్మీదేవి వేధింపులు అధికమయ్యాయి. ఈ క్రమంలో మనస్తాపం చెందిన పవిత్ర ఆదివారం తన ఇంట్లోని గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందింది. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కు చెల్లించుకున్న ఎమ్మెల్యే దగ్గుపాటి



మొక్కు తీర్చుకుంటున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, కుటుంబ సభ్యులు

అనంతపురం అర్బన్, జూన్ 30: తిరుమలకు కుటుంబసభ్యులతో ఆదివారం కాలినడకన వెళ్లిన అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్... ఆలయం వద్ద 101 టెంకాయలు కొట్టి తన మొక్కు చెల్లించారు. స్వామి వారిని దర్శించుకున్నారు. ఎన్నికలకు ముందు తమ పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు సీఎం కావాలని స్వామి వారిని మొక్కుకున్నానని, దీంతో తన మొక్కు తీర్చుకున్నానని ఆయన తెలిపారు. రాష్ట్రాన్ని రక్షించేందుకు కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి చంద్రబాబునాయుడిని సీఎంగా చేశారని అన్నారు. ఆయన వెంట భార్య శ్రీలక్ష్మి, కుమార్తె అశ్రిత, కుమారుడు మనిహాస్, ఇతర కుటుంబ సభ్యులు ఉన్నారు.

అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

శింగనమల జూన్ 30: శింగనమలలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని బీజేపీ మండల నాయకులు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు ఆదివారం అనంతపురం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి ఓబిలేసు, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నరేంద్రయాదవ్ ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. మండలంలో చాలా పేద కుటుంబాలు ఉన్నాయని, ప్రతి పనికి మండల కేంద్రమైన శింగనమలకు వస్తున్నారని, వారు డబ్బులు పెట్టి భోజనం కొనిలేని పరిస్థితిలో ఉన్నారని, కావున శింగనమలలోనే అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని కోరారు.

హామీ నిలుబెట్టుకున్న సీఎం



మాట్లాడుతున్న వేణుగోపాల్

అనంతపురంరూరల్, జూన్ 30: పింఛన్‌దారులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నిలబెట్టుకు న్నారని మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్ అన్నారు. ఆదివారం స్థానిక అరవిందనగర్‌లో ఎమ్మెల్యే పరిటాల సునీత క్యాంపు కార్యాలయంలో మండల ప్రధాన కార్యదర్శి పాముదాయి రఘు, మాజీ మండల కన్వీనర్ చల్లా జయకృష్ణతో కలసి ఆయన మాట్లాడారు. పెంచిన పింఛన్, ఏప్రిల్, మే, జూన్ నెలతో కలిపి రూ.7వేలు జూలైలో ఇస్తామని చంద్రబాబు నాడు హామీ ఇచ్చారనీ, సోమవారం నుంచి ఆ మహోత్తర కార్యక్రమం ప్రారంభం అవుతోందని అన్నారు. ఇందులో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ఎంబీఏతో ఉద్యోగాలు మెండు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీన్ శేషాద్రి కిరణ్

అనంతపురం సెంట్రల్, జూన్ 30: ఎంబీఏ పూర్తిచేసిన విద్యార్థులకు వివిధ రంగాల్లో ఉద్యోగాలు మెండుగా లభిస్తాయని అశోక ఇంజనీరింగ్ కళాశాల ఐక్యూఏసీ డీన్ శేషాద్రి కిరణ్ పేర్కొన్నారు. జేఎన్‌టీయూ ఎంబీఏ విద్యార్థులకు రీసెర్చ్ మెలకువలపై ఆదివారం నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. ఫిన్‌టెక్, డేటా సైన్స్, అనలటిక్స్ కోర్సుల విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. టూల్స్ వినియోగం, విశ్లేషణ, సమాచార సేకరణ, ప్రాజెక్ట్ రిపోర్ట్‌ను తయారు చేయడం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి ప్రొఫెసర్ నారాయణరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు బీసీ లక్ష్మన్న, విశ్వనాథ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ చీనీవ్యాపారి మృతి



బాబయ్య (ఫైల్)

గార్లదిన్నె, జూన్ 30: మండలంలోని మర్తాడుకు చెందిన చీనీవ్యాపారి దూదేకుల బాబయ్య (53) అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మరణించాడు. బాబయ్య రైతుల నుంచి చీనీకాయలు కొని హైదారాబాదు, బెంగుళూరు, అనంతపురం మార్కెట్‌లలో వ్యాపారం చేసేవాడు. గత ఏడాది నుంచి చీనీకాయల వ్యాపారంలో నష్టాలు రావడం, కుటుంబ పోషణకు మొత్తం సుమారు రూ. 40 లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పులు తీర్చాలని ఒత్తిళ్లు రావడంతో మనస్థాపానికి గురై బాబయ్య శనివారం ఇంట్లో పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు యత్నించాడు. 108 వాహనం ద్వారా అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం రాత్రి మరణించాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బాబయ్యకు భార్య ఖైరున్‌బీ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 30: స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్‌స్టేడియంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2024 పోటీలు ఆదివారంతో ముగిశాయి. అండర్-15 బాలుర సింగిల్స్‌లో మురారి వెంకట్, డబుల్స్‌లో జెరోన్ ప్రతిక్-రాజ్‌దీప్, బాలికల్లో నక్షత్ర, డబుల్స్‌లో యగ్నశ్రీ-సహస్ర విజేతలుగా నిలిచారు. అండర్-17 బాలికల్లో సింగిల్స్‌లో యజ్ఞశ్రీ, డబుల్స్‌లో నబియా-ఇం దుప్రియ, బాలురలో మురారి వెంకట్, డబుల్స్‌లో జెరోన్‌ప్రతిక్-రాజ్‌దీప్ విజేతలుగా నిలిచారు. అండర్-19 బాలుర సింగిల్స్‌లో విగ్నేష్, డబుల్స్‌లో రాజు-విగ్నేష్, అండర్-11లో బాలికల్లో శ్రీనిధి, డబుల్స్‌లో శ్రీనిధి-మనస్వి, బాలుర సింగిల్స్‌లో కార్తిక్, డబుల్స్‌లో కార్తిక్-సీహాల్, అండర్-13 బాలికల సింగిల్స్‌లో ముస్కాన్, డబుల్స్‌లో రిధి-ముస్కాన్, బాలుర సింగిల్స్‌లో రుషి, డబుల్స్‌లో లిక్షిత్-రుషి, పురుషుల సింగిల్స్‌లో విజయ, డబుల్స్‌లో సునీత్-పాల్‌ప్రణీత్ విజేతలుగా నిలిచారు. విజేతలకు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బుగ్గయ్యచౌదరి, ప్రధాన కార్యదర్శి జయకుమార్ బహుమతులు అందజేశారు. వీరు ఈనెలలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మధు రాయల్, జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్య క్షుడు మహ్మద్‌షఫీ, సహాయ కార్యదర్శి అబ్దుల్‌అజీజ్, కోశాధికారి సాంబమూర్తి, సభ్యులు నరేష్, ప్రసాద్ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సభ్యులు





పెనకచెర్లలో పింఛన్ల పంపిణీపై అవగాహన కల్పిస్తున్న టీడీపీ నేతలు, శింగనమలలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

నేడు పింఛన్ల పంపిణీ పండుగ

గార్లదిన్నె, జూన్ 30: సీఎం చంద్ర బాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు పింఛన్ల మొత్తాన్ని పెంచారని, సోమ వారం నుంచి ఆ మొత్తాన్ని లబ్ధిదారు లకు పంపిణీ చేస్తారని టీడీపీ నేతలు తెలిపారు. దీనిపై గార్లదిన్నె, మర్తాడు, కల్లూరు, పెనక చెర్ల గ్రామాల్లో పింఛన్ల పండుగ పేరుతో అవగాహన కార్యక్ర మాలను టీడీపీ నేతలు ఆదివారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ... ఒక్కఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన సైకో జగన్‌రెడ్డి మాట తప్పి విడతల వారిగా పింఛన్ పెంచితే... ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు ఒకేసారి రూ.వెయ్యి పెంచారన్నారు. ఇచ్చిన హామీని నెరవేర్చడం ఒక్క ఎన్డీఏ కూటమికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున, టీడీపీ నాయకులు నరసింహారెడ్డి, చితంబరప్ప, సురేష్, చిరుతల గోపాల్‌రెడ్డి, మల్లికార్జున, గోవింద్, హరినాథ్ రెడ్డి, కుళ్ళాయప్ప, వేణు పాల్గొన్నారు.

శింగనమల: సామాజిక ఎన్టీఆర్ భరోసా పింఛన్లను సచివాలయ సిబ్బంది సోమవారం ఉదయం 6 గంటల నుంచే ఇవ్వాలని ఎంపీడీవో బి.వెంకటరమణ సూచించారు. ఆదివారం పింఛన్లు పంపిణీ పై పింఛన్‌దారులతో శింగనమల సోదనపల్లి గ్రామంలో గ్రాససభలు నిర్వహించారు. అలాగే 13 సచివాలయాల్లో పింఛన్‌దారులతో అధికారులు సభలు ఏర్పాటు చేసి పింఛన్ పెంపు విధి విధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ విజయమ్మ, సర్పంచ్ నాగమునేమ్మ, టీడీపీ నాయకులు వెంకటేశ్, నగముని సత్తి ఆది, రాజశేఖర్ యాదవ్, అధికారులు ఈఓపీఆర్‌డీ మురళికృష్ణ, ఓబిరెడ్డి, నాగేంద్ర, జయశ్రీ శైలజ రమేష్ సుధాకర్ పాల్గొన్నారు.

విజయవంతం చేయండి : దేగల

శింగనమల : ఎన్టీఆర్ పింఛన్ల పంపిణీని కార్యక్రమాన్ని సోమవారం ఓ పండుగలా గ్రామాల్లో నిర్వహించాలని జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి, గుమ్మేపల్లి సర్పంచ్ లలితమ్మ పార్టీ శ్రేణులకు సూచించారు. ఆదివారం మండలంలోని కల్లుమడి సచివాలయంలో పింఛన్లు పింఛన్లు పంపిణీపై నిర్వహించిన గ్రామ సభలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శిలు రఫి, నాగరాజు, టీడీపీ నాయకులు చిట్టి, సుధాకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వం సిద్ధం

చెన్నేకొత్తపల్లి : మండలంలో సోమవారం పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ మోహన్‌కుమార్ తెలిపారు. ఉదయం ఆరు గంటల నుంచి సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందజేస్తారన్నారు. మండలంలో 7046 మందికి 4,97,45,000 పంపిణీ చేస్తున్నాట్లు తెలిపారు.

పంపిణీ చేయనున్న ఎమ్మెల్యేలు

రాప్తాడు: నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సోమవారం నిర్వహించే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత పాల్గొంటారు. ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలంలోని రాచానపల్లి పంచాయతీలో, రాప్తాడు, కనగానపల్లి మండలం మామిళ్లపల్లి గ్రామం, చెన్నేకొత్తపల్లి, రామగిరిలో జరిగే పింఛన్లు పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొంటారు. దీనిపై ఎమ్మెల్యే అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ ... రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒక్కో పింఛన్‌దారుడు రూ.7 వేలు అందిస్తున్నామని, కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అనంతపురం అర్బన్ : అనంతపురం అర్బన్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం నిర్వహించే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పాల్గొంటున్నారు. సోమవారం ఉదయం పాతూరులోని బ్రహ్మంగారి ఆలయం వద్ద పింఛన్ల పంపిణీని ఎమ్మెల్యే ప్రారంభిస్తారు. అనంతరం ఉదయం 6.30 గంటలకు నున్నంగేరు, ఉదయం 7 గంటలకు గుల్జార్ పేట, 7.30 గంటలకు సాయి నగర్, 8 గంటలకు బుడ్డప్ప నగర్, 8.30 గంటలకు టీవీ టవర్, 9 గంటలకు ఆజాద్ నగర్, 9.30 గంటలకు రంగస్వామి నగర్ బోర్డు, 10 గంటలకు గంగా నగర్, 10.30 గంటలకు రాజీవ్ కాలనీ, 11 గంటలకు నారాయణపురం, 11.30 గంటలకు రుద్రంపేట, మధ్యాహ్నం ఒంటి గంటకు సప్తగిరి సర్కిల్‌లోని ఆర్య వైద్య వృద్ధాశ్రమంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొంటారు.

శింగనమల: శింగనమలలో సోమవారం ఎస్సీ కాలనీలో ఇంటింట పింఛన్ల పంపిణీలో కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పాల్గొంటున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ తెలిపారు. అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కార్యకర్తల రుణం తీర్చుకుంటాం

ఎమ్మెల్యే పరిటాల సునీత, ఎంపీ బీకే పార్థసారథి

ధర్మవరంరూరల్, (కనగానపల్లి), జూన్ 30: తన విజయానికి కృషి చేసిన ప్రతి కార్యకర్త రుణం తీర్చుకుంటానని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. కనగానపల్లిలో సర్పంచ్ అంకేపరిమిశ రామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం పెద్దఎత్తున విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి హాజరయ్యారు. ఎన్నికల ఫలితాల అనంతరం తొలిసారిగా వారు కనగానపల్లికు రావడంతో పండుగ వాతావరణం నెలకొంది. ఈ విజయోత్సవ ర్యాలీకి మండలం నుంచే కాక నియోజకవర్గ వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గతంలో ఎన్నడూ లేనివిధంగా భారీ మెజార్టీ ఇచ్చి గెలిపించి తనపై మరింత బాధ్యత పెంచారన్నారు. కష్టసుఖాల్లో కార్యకర్తలు అండగా ఉన్నారని, వారందరికి న్యాయం చేస్తానని అన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీమేరకు ప్రతి హామీని నెరవేరుస్తానన్నారు. ఎంపీ బీకే మాట్లాడుతూ హిందూపురం ఎంపీగా తాను గెలిచేందుకు రాప్తాడు నియోజకవర్గం అత్యంత కీలకమన్నారు. ఈ ప్రాంతానికి కేంద్రం నుంచి అధిక నిధులు తెచ్చి అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వాల్మీకి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ

7న బ్రాహ్మణ ఐక్య సమావేశం

బుక్కరాయసముద్రం: బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల ఏడో తేదీన అనంతపురంలో బ్రాహ్మణ ఐక్య సమావేశాన్ని నిర్వహిస్తున్నా మని, ఉమ్మడి జిల్లాలోని బ్రాహ్మణులు అధిక సంఖ్యలో పాల్గొని దీన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసింహ పిలుపునిచ్చారు. అందుకు సంబంధించిన పోస్టర్ ఆదివారం స్థానిక వీరభద్ర స్వామి దేవాలయంలో స్థానిక బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించిన ఆయన మాట్లాడారు. బ్రాహ్మణుల రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం నేతలు మారుతి, శివకు మార్, చందుస్వామి, సుబ్బయ్య, లక్ష్మీనరసమ్మ, వెంకటేష్ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గరుడాద్రి బ్రాహ్మణ సంఘం నేతలు

నూతన క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలి

అనంతపురం కల్చరల్, జూన్ 30: ప్రజాస్వామ్య హక్కులను హరించేలా జూలై 1 నుంచి బీజేపీ ప్రభుత్వం అమలు చేయనున్న మూడు నూతన క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలని పౌర చైతన్య వేదిక రాష్ట్ర ఇన్చార్జి, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు డిమాండ్ చేశారు. ఆదివారం పౌర చైతన్యవేదిక ఆధ్వర్యంలో క్లాక్‌టవర్ వద్ద నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరాజులు మాట్లాడుతూ... నూతన చట్టాల గురించి సమాజంలో ఎటువంటి చర్చ లేకుండా, అత్యంత నిరంకుశంగా సోమవారం నుంచి నూతన క్రిమినల్ చట్టాలను అమలు చేస్తామన్న బీజేపీ ప్రభుత్వ నిర్ణయాన్ని పౌర చైతన్య వేదిక వ్యతిరేకిస్తోందన్నారు. ఇప్పటికే ఉన్న సీపీసీ, సీఆర్పీసీ, క్రిమినల్ ఎవిడెన్స్ యాక్ట్ నేర చట్టాల స్థానంలో భారతీయ నాగరిక బీఎన్ఎస్, భారతీయ నాగరిక్ శిక్ష, సన్హిత బీఎన్ఎసస్, బీఎస్ఏ అనే కొత్తపేర్లతో చట్టాలను తీసుకొస్తున్నారన్నారు. ఈ చట్టాలు ప్రజాస్వామ్య హక్కులను హరిస్తాయని, ప్రజల నిరసనలు, చట్ట వ్యతిరేకం కాబోతున్నాయని వాపోయారు. ప్రజా ఉద్యమాలు పెరగకుండా అణచివేయడానికే ఈ చట్టాల ను ఉపయోగిస్తారని విమర్శించారు. కార్యక్రమంలో పౌర చైతన్య వేదిక జిల్లా ఇన్చార్జి రాఘవేంద్ర, నాయకులు, ప్రజా స్వామ్యవాదులు పాల్గొన్నారు.



క్లాక్‌టవర్ వద్ద నిరసన తెలుపుతున్న పౌర చైతన్య వేదిక నాయకులు

వెటరన్ క్రికెట్ రన్నరప్ అనంత

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 30: వెటరన్ క్రికెట్ పోటీల విజేతగా హైదరాబాద్, ఆతిథ్య జట్టు అనంతపురం రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఆదివారం స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో వెటరన్ క్రికెట్ పోటీల్లో భాగంగా ఫైనల్స్ నిర్వహించారు. అనంత పురం, హైదరాబాద్ జట్లు తలపడగా... మొదట బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి కేవలం 81 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన హైదరాబాద్ 10.3 ఓవర్లలో వికెట్ నష్టానికి 84 పరుగులు చేసి తొమ్మిది వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆర్డీటీ డైరెక్టర్ రఫీక్‌అహ్మద్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టోర్నీ కార్యనిర్వాహక కార్యదర్శి నాగప్ప, వెటరన్ క్రీడాకారులు రజనికాంత్, షాబుద్దీన్, తేజామూర్తి, నాగేంద్రప్రసాద్, వెంకటేష్, రవికాంత్ పాల్గొన్నారు.



అనంతపురం జట్టుకు రన్నరప్ ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

ఆలయంలో అభివృద్ధి పనులు



దాతలను సన్మానిస్తున్న ప్రముఖులు

రామగిరి, జూన్ 30: మండలంలోని శ్రీముత్యాలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో బెంగుళూర్‌కు చెందిన ముత్యాలమ్మ దేవి రెసిడెన్షియల్ ట్రస్టు 22 స్నానాల, మరుగుదొడ్లను నిర్మించింది. వాటిని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ ట్రస్టు అధ్యక్షుడు సిటీమోహన్, ఉపాధ్యక్షుడు నరసింహయ్య, ప్రధాన కార్యదర్శి లింగరాజు, సహాయకార్యదర్శి చంద్రశేఖర్, అన్నప్ప, సంచాలకులు కార్తీక్, కజాన్సీ, నరసింహ, ఆర్వో వేణుగోపాల్, ఆంజనేయులు, మంజునాథ్, ఓబుళపతి, ప్రకాశ్, ఆటో నాగప్పను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ సీనియర్ నాయకుడు రామ్మూర్తినాయుడు, పరందామయాదవ్, తెలుగు యువత అధ్యక్షుడు శ్రీధర్ నాయుడు, నసన కోట ఎంపీటీసీ శ్రీనివాసులు, ఈఓ వెంకటేశ్ పాల్గొన్నారు.

నేటి నుంచి క్రికెట్ పోటీలు



జిల్లా మహిళా క్రికెట్ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 30: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ అండర్-19 మహిళల క్రికెట్ పోటీలు సోమవారం నుంచి అనంత క్రీడా గ్రామం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి తెలిపారు. ఎంపికైన జిల్లా అండర్-19 మహిళా క్రికెట్ జట్టును ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి ప్రకటించారు. ఇప్పటికే ఆంధ్రా క్రికెట్ సౌత్ జోన్ మహిళా క్రికెట్ పోటీలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లు శర్మాస్‌వలీ, కుమార్, నరేష్ పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి వెండి ఆభరణాలు



వెండి వస్తువులను అందజేస్తున్న మదన్‌మోహన్‌రెడ్డి, సావిత్రమ్మ

గార్లదిన్నె, జూన్ 30: మండలంలోని కోటంక గ్రామ సమీపంలో గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆదివారం ఇరువురి భక్తులు రూ. 1,56,000 విలువ చేసే వెండి ఆభరణాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆకులేడుకు చెందిన కాశిరెడ్డి మదన్‌మోహన్‌రెడ్డి, సావిత్రమ్మ దంపతులు రూ. 1,33,000 విలువ చేసే వెండి అర్ఘ్య పాత్ర, ఉద్ధరని అందచేశారు. అలాగే కోటంక గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యేశ్వర అగ్రోట్రేడర్స్ నిర్వహకులు కలుగూరు దేవా, వరలక్ష్మి దంపతులు రూ. 23 వేలు విలువ చేసే వెండి వస్తువులను స్వామి వారికి అందచేశారు. వారి వాటిని ఆలయ ప్రధాన అర్చకుడు రామాచార్యులకు అందచేశారు.

ఉత్సవ విగ్రహాలు అందజేత



ఉత్సవ విగ్రహాలను అందజేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

నార్పల, జూన్ 30: స్థానిక అయ్యప్పస్వామి దేవాలయంలో నూతనంగా నిర్మిస్తున్న దేవాలయానికి జమ్మల మడుగుకు చెందిన డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, హరితరెడ్డి దంపతులు నరసిం హస్వామి, లక్ష్మీదేవి ఉత్సవ విగ్రహాలను ఆలయ ప్రధాన అర్చకుడు బ్రహ్మేంద్రస్వామి ఆదివారం అందజేశారు. ఆ విగ్రహాల విలువ రూ.55 వేలని దాతలు తెలిపారు.

నేటి నుంచి రేషన్ పంపిణీ

అనంతపురంరూరల్, జూన్ 30: మండలంలోని ఎండీయూ ఆపరేటర్ల ద్వారా సోమవారం నుంచి ప్రజలకు రేషన్ సరుకుల పంపిణీ చేయనున్నట్లు రూరల్ మండలం తహసీల్దార్ వెంకటనాయుడు ఆదివారం ప్రకటనలో తెలిపారు. రేషన్ కార్డుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నిరుపేదకు నిత్యావసరాల అందజేత

అనంతపురం కల్చరల్, జూన్ 30 : ఆర్థిక కష్టాల్లో ఉన్న నిరుపేద మహిళకు నిత్యావసర సరుకులు , ఆర్థిక సాయం అందజేసి నిత్యసురభి ట్రస్టు అండగా నిలిచింది. ఇటుకులపల్లి గ్రామంలో నివసిస్తున్న మీనా భర్త ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న ఆమె నిత్యసురభి ట్రస్టును ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో నిత్యసురభి ట్రస్టు చైర్‌పర్సన్ నిర్మలా మురళి ఆదివారం మీనా నివాసానికి చేరుకుని ఒక బియ్యం ప్యాకెట్, 26 రకాల నిత్యావసర సరుకులతో పాటు రూ. మూడు వేలు నగదుసాయం అందజేశారు.

పశువుల సంత ఆదాయం రూ.4.12 లక్షలు

అనంతపురంరూరల్, జూన్ 30: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువుల సంతతో మార్కెట్‌కు రూ.4,12,730 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.2,65,180, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,47,550 ఆదాయం వచ్చిందని తెలిపారు.

అసౌకర్యాల నడుమ జూనియర్ కళాశాల

● 13 ఏళ్లుగా పాత భవనాల్లోనే చదువులు ● రెగ్యులర్ అధ్యాపకులు నిల్ ● ఇక్కడే బాలికల కళాశాల నిర్వహణ



ఉరవకొండ, జూన్ 30: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పడి 13ఏళ్లు అవుతున్నా నేటికీ అవసరమైన భవనాలు, ఇతర వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కాంట్రాక్టు అధ్యాపకులు, గెస్ట్ ఫ్యాకల్టీతోనే నెట్టుకొస్తున్నారు. నేటికీ రెగ్యులర్ అధ్యాపకుల పోస్టులకు అనుమతులు లేవు. ఫలితాల్లో విద్యార్థులు ప్రతిభకనబరుస్తున్నా సౌకర్యాలు కల్పించడంలో అధికారులు దృష్టి సారించడంతో విఫలమవుతున్నారు. ఒక టిన్నర దశాబ్ద కాలంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతూనే చదువుకోవాల్సి వస్తోంది. 2009 ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. కళాశాలలో 220మంది దాకా విద్యార్థినులున్నారు. నియోజకవర్గం లోని ఐదు మండలాలతో పాటు కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లోని విద్యార్థులు కూడా చదువుకుంటున్నారు. హెచ్ఈసీ, ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులు ఉన్నాయి. తెలుగు, ఇంగ్లీష్ మీడియం కూడా ఉంది. నేటికీ సొంత భవనాలు నిర్మించలేదు. ప్రభుత్వ బాలికల కళాశాల నిర్మాణం కోసం 2ఎకరాల స్థలం కేటాయించినా ఆ ఫైల్ ముందుకు సాగలేదు. రెగ్యులర్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బందిని నియమించిన దాఖలాలు లేవు. బాలుర కళాశాల భవనంలోనే ఈ కళాశాలను నిర్వహిస్తున్నారు. 8 గదులు మాత్రమే ఉన్నాయి. ల్యాబ్‌కు అవసరమైన గదులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి శాశ్వత భవనాలు నిర్మించాలని కోరుతున్నారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ మమతను వివరణ కోరగా కళాశాల భవననిర్మాణం కోసం 2 ఎకరాల స్థలం కేటాయించారని, ప్రస్తుతం కలెక్టరేట్ నుంచి అనుమతులు రావాల్సి ఉంది. రెగ్యూలర్ అధ్యాపకులు లేరు.


బాలుర కళాశాలలో బాలికలకు నిర్వహిస్తున్న తరగతి గదులు

నేడు పింఛన్ పంపిణీని ప్రారంభించనున్న మంత్రి కేశవ్

ఉరవకొండ, జూన్ 30: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని సోమవారం ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవ్ ప్రారంభించనున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. పట్టణంలోని పాతపేటలో నేరుగా లబ్ధిదారులకు మంత్రి పింఛన్ అందిస్తారన్నారు. ఉదయం 7 గంటలకు ఆంజనేయ స్వామి ఆలయంలో పూజల అనంతరం పింఛన్ పంపిణీకి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. పట్టణంలోని వివిధ వార్డులలో మంత్రి పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

మంత్రిని కలిసిన పెన్షనర్లు: మండలంలోని కౌకుంట్ల గ్రామంలో మంత్రి పయ్యావుల కేశవ్‌ను పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు ఆదివారం కలిశారు. మంత్రిని పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు క్రిష్టప్ప, నారాయణస్వామి పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంలో ఎమ్మెల్యే అమిలినేని...

కళ్యాణదుర్గం, జూన్ 30: ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సోమవారం కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని పలు గ్రామాలకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేయనున్నారు. కళ్యాణదుర్గం రూరల్ మండలం ముద్దినాయనపల్లి, గోళ్ల, బ్రహ్మసముద్రం మండలం గొంచిరెడ్డిపల్లి, కోనాపురం, శెట్టూరు మండలం యాటకల్లు, లక్ష్మంపల్లి, కుందుర్పి మండలం జంబుగుంపల, బెస్తరపల్లి, కంబదూరు మండలం కంబదూరు ఎస్సీ కాలనీ, కదిరిదేవరపల్లి, కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో వార్డు 8 గుండలప్ప దొడ్డి, వార్డు 10 మారెంపల్లి, వార్డు 22 గరీబ్‌నగర్ కాలనీల్లో ఎమ్మెల్యే పర్యటిస్తున్నారు. పింఛన్ల లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పింఛన్ సొమ్మును అందచేయనున్నారు. ఆయా మండలాల్లో నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని టీడీపీ నాయకులు కోరారు.

పింఛన్ల పెంపుపై టీడీపీ శ్రేణుల సంబరాలు


చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పింఛన్‌దారులు

విడపనకల్లు, జూన్ 30: రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులు, వితంతువులకు ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.4వేలు పింఛను పెండంతో టీడీపీ నాయకులు కార్యకర్తలు, పింఛన్ దారులు ఆదివారం ఆయా గ్రామాల్లో సంబరాలు జరుపుకున్నారు. విడపనకల్లు, వీ కొత్తకోట, పాల్తూరు, ఉండబండ, చీకలగురికి, వేల్పుమడుగు గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పార్లమెంట్ కమిటీ సభ్యుడు హనుమంతు, సినిమా రామాంజనేయులు, సర్పంచ్ చంద్రశేఖర్, తిమ్మరాజు, తిప్పారెడ్డి, పాపారాయుడు, విజయ్ శెట్టి, డీలర్ జయరాం పాల్గొన్నారు.

విద్యార్థిని చదువుకు ఆర్థికసాయం



విద్యార్థినికి చెక్కు అందిస్తున్న ట్రస్టు చైర్మన్ బద్దేనాయక్

బ్రహ్మసముద్రం, జూన్ 30: మండల కేంద్రానికి చెందిన ఓ అనాథ విద్యార్థిని డీఎస్సీకు దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన సర్టిఫికెట్లు కళాశాల నుంచి తీసుకునేందుకు ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్టు సభ్యులు రూ.15 వేలు ఆర్థిక సాయం అందించారు. మండల కేంద్రానికి చెందిన తిమ్మక్క, మారెన్న దంపతుల కుమార్తె నవ్య తాడిపత్రి పట్టణంలో బీఈడీ పూర్తి చేసింది. కళాశాలలో చేరేటప్పుడు 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు ఒరిజినల్ సర్టిఫికెట్లు అందించింది. ప్రస్తుతం కోర్సు పూర్తి కాగా కళాశాల యాజమాన్యం రూ.15 వేలు ఫీజు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని చెప్పడంతో అనాథగా వున్న తనకు అంత డబ్బు కట్టలేక అలాగే వుంది. ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీకి దరఖాస్తు చేసుకోవాలంటే సర్టిఫికెట్లు అవసరం కావడంతో ట్రస్టును స్పందించి రూ.15 వేల చెక్కును బీఆర్ శ్రీనివాసులు చేతుల మీదుగా విద్యార్థినికి అందజేశారు. ట్రస్టు సభ్యులు బద్దేనాయక్, సురేష్, లోకేష్, ఉపాధ్యాయులు రాజన్న పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి..

యల్లనూరు, జూన్ 30: మండలంలోని చిలమకూరు గ్రామానికి చెందిన చిన్నారి ప్రణతి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న విషయం తెలిసిందే. చిన్నారి వైద్యఖర్చులకు రాజగోపాల్ దంపతులు రూ.6వేలు ఆర్థిక సాయం అందించినట్లు ప్రణతి తండ్రి గంగరాజు తెలిపారు. గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు సూర్యనారాయణరెడ్డి ద్వారా ప్రణతి హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని తనవంతు సాయంగా చికిత్స ఖర్చులకు అందిస్తున్నట్లు లలితామెగామాల్ అధినేత రాజగోపాల్ తెలిపారు.

లయన్స్‌క్లబ్ సేవలకు రూ.10వేలు వితరణ

యాడికి, జూన్ 30: రాయలచెరువు లయన్స్‌క్లబ్ సేవలకు టీడీపీ నాయకుడు కులశేఖర్‌నాయుడు రూ.10వేలు వితరణ చేశారు. ఆయన మాట్లాడుతూ తండ్రి అమిలినేని వెంకటనాయుడు వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం లయన్స్‌క్లబ్ విరాళాన్ని అందించానన్నారు. ఈ మొత్తాన్ని హైస్కూల్, మోడల్ స్కూల్‌లో 10వ తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన విద్యార్థులకు పోత్సాహక బహుమతులుగా అందజేయాలని క్లబ్ సభ్యులనుకోరారు. అమిలినేని లక్ష్మీదేవి, లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ రవికుమార్‌రెడ్డి, సభ్యులు సూర్యనారాయణ, ఇస్మాయిల్, ప్రసాద్, రామమోహన్‌రెడ్డి, రామనాథ్ పాల్గొన్నారు.

ట్యాంకర్లతో నీటి సరఫరా


ట్యాంకర్ నుంచి నీటిని పట్టుకుంటున్న ప్రజలు

తాడిపత్రిటౌన్, జూన్ 30: మండలంలోని సజ్జలదిన్నె గ్రామంలో టీడీపీ నాయకులు కేశవరెడ్డి, గోపాల్‌రెడ్డి, అక్కిరెడ్డి నాలుగు ట్యాంకర్ల ద్వారా గ్రామస్థులకు నీటిని సరఫరా చేస్తున్నారు. ఐదురోజులక్రితం గ్రామ శివారులోని మంచినీటి పైపులైను పగిలిపోయి తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. స్థానిక టీడీపీ నాయకులు ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి దృష్టికి తీసుకుపోగా స్పందించిన ఆయన వెంటనే ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని ఆదేశించారని తెలిపారు. దీంతో ట్యాంకర్లను ఏర్పాటుచేసి నీటిని అందించారు.

జేసీ ప్రభాకర్‌రెడ్డి సోదరి మృతి

తాడిపత్రి, జూన్ 30: తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సోదరి సుజాతమ్మ అనారోగ్యంతో ఆదివారం అర్ధరాత్రి మృతి చెందారు. ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డితో పాటు జేసీ ప్రభాకర్‌రెడ్డి సోమవారం తాడిపత్రికి రానున్నట్లు తెలిసింది. సార్వత్రిక ఎన్నికల అనంతరం జరిగిన అల్లర్ల దృష్ట్యా కోర్టు ఆదేశాలతో అస్మిత్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తాడిపత్రిలో ప్రస్తుతం నివాసం ఉండడం లేదు. సోదరి మృతి చెందడంతో తాడిపత్రికి రానున్నట్లు సమాచారం.

చిన్నారులను అభినందించిన ఎమ్మెల్యే


ప్రతిభ చూపిన చిన్నారులతో ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి

తాడిపత్రిటౌన్, జూన్ 30: రోలర్ స్కేటింగ్‌లో అత్యంత ప్రతిభచూపి నేషనల్స్‌కు ఎంపికైన చిన్నారులను టీడీపీ ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి అభినందించారు. అనంతపురంలోని స్థానిక నివాసంలో ఆదివారం కోచ్ సాంబశివ చిన్నారులతో కలిసి ఎమ్మెల్యేను కలిశారు. తిరుపతిలో జరిగిన రోలర్ స్కేటింగ్‌లో 8మంది పాల్గొనగా వారిలో ముక్తీశ్వరి రెండు స్వర్ణం, ఒక వెండి, బిల్వికరెడ్డి రెండు స్వర్ణాలు, రిత్వికరెడ్డి ఒక స్వర్ణం, ఒక వెండి, అనిరుద్ మూడు వెండి, మేఘన్‌తేజ్ ఒక వెండి, శ్రీ తన్వీ ఒక వెండి, సునైన రెండు స్వర్ణాలు, ఉజ్వల్‌కేశవనాయుడు ఒక వెండి పతకాలను సాధించారని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలు


గాయపడిన కానిస్టేబుల్ అశోక్

యాడికి, జూన్ 30: రోడ్డుప్రమాదంలో కానిస్టేబుల్ అశోక్ తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం మండలంలోని వేములపాడు-పెండేకల్లు జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలమేరకు గుత్తికి చెందిన అశోక్ పెద్దపప్పూరు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. కోర్టు విధులను నిర్వహించే అశోక్ ఆదివారం తాడిపత్రిలో పనులు చూసుకొని ద్విచక్రవాహనంలో గుత్తికి వెళుతున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం తాడిపత్రికి తరలించారు.

ఆటో ఢీకొని వ్యక్తి...

పుట్లూరు, జూన్ 30: మండలంలోని శనగలగూడూరు గ్రామశివారులో ఆటో ఢీకొన్న సంఘటనలో తాడిపత్రికి చెందిన మహమ్మద్ అక్రమ్ అనే వ్యక్తి గాయపడినట్లు పోలీసులు తెలిపారు. మహమ్మద్ అక్రమ్ ద్విచక్రవాహనంలో తాడిపత్రికి వెళుతుండగా కడపజిల్లా వెలిదండ్ల గ్రామానికి చెందిన మహబూబ్‌బాషాకు చెందిన ఆటో ఢీకొనడంతో అక్రమ్ గాయపడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు మహబూబ్‌బాషాపై కేసు నమోదుచేశామని పోలీసులు తెలిపారు.

ద్విచక్రవాహనం బోల్తా పడి యువకుడు...

గుత్తి, జూన్ 30: పట్టణంలోని కోటవీధికి చెందిన షేక్షావలి అనే యువకుడు ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. షేక్షావలి తన ద్విచక్రవాహనంలో పని నిమిత్తం అనంతపురం రోడ్డులో వెళ్తుండగా ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

యాడికి, జూన్ 30: మండలంలోని చింతలాయపల్లి గ్రామం వద్ద ఆదివారం 9మంది పేకాటరాయుళ్లను అరెస్ట్‌చేసి వారివద్ద నుంచి రూ.30వేలు నగదుతోపాటు 6ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించి 9మందిని చేశామన్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

తాడిపత్రిటౌన్, జూన్ 30: పట్టణ సమీపంలోని యల్లనూరురైల్వేగేట్ వద్ద ఆదివారం కడపజిల్లా కొండాపురం మండలం చౌటిపల్లికి చెందిన రవీంద్ర (32) రైలుకింద పడి ఆత్మహత్య చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు. రవీంద్ర కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలం నుంచి మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తిచెందిన రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రవీంద్రకు భార్య ఆదిలక్ష్మితోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నాటుసారా సీజ్

యాడికి, జూన్ 30: మండలంలోని గుడిపాడు గ్రామంలో ఆదివారం 8 లీటర్ల నాటుసారాను సీజ్ చేసినట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. గుడిపాడు గ్రామంలో నాటుసారా తయారుచేసి విక్రయిస్తున్నారన్న సమాచారంతో దాడిచేసినట్లు తెలిపారు. గుడిపాడు గ్రామశివార్లలో గ్రామానికి చెందిన బోయ కంబగిరిస్వామి అనేవ్యక్తి నాటుసారా తయారుచేసి విక్రయిస్తుండగా అరెస్ట్‌చేసినట్లు తెలిపారు.

ట్రాలీ రికవరీ చేయాలని పోలీసులకు ఫిర్యాదు

గుంతకల్లుటౌన్, జూన్ 30: ట్రాక్టర్ ట్రాలీ చోరీకి గురైందని, దానిని రికవరీ చేయాలని రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు గుర్బాడు గ్రామానికి చెందిన డీ ఆదినారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ వామి దొడ్డిలో ఏపీ02 టీటీ 7204 ట్రాక్టర్ ట్రాలీని ఉంచగా 26వ తేదీన అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారన్నారు. ఈ విషయం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

అనాథ పిల్లలకు దుస్తుల పంపిణీ

గుత్తి, జూన్ 30: పట్టణంలోని ఐడీఎల్ యూత్ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో అనాథ పిల్లలకు ఆదివారం దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. సమాజంలో మానవత్వాన్ని పెంపొందించడానికి పేదలకు, అనాథలకు ఆసరా ఉండడానికి యూత్ మూవ్‌మెంట్ కృషి చేస్తుందన్నారు. 25మంది అనాథ పిల్లలకు దుస్తులను పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు బ్రదర్ జిలాన్, షరీఫ్, లాలెప్ప పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


పూర్వ విద్యార్థుల గ్రూప్ ఫొటో

కూడేరు, జూన్ 30: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1979-80 సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళం జరిగింది. ఆదివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి, వివిధ గ్రామాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులు ఒక్కచోట చేరి అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ప్రస్తుతం వివిధ హోదాల్లో ఉండటంతో పాఠశాల అభివృద్ధికి రూ.లక్ష విరాళం ప్రకటించారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా


ట్రాక్టర్‌లో ఇసుకను లోడ్ చేస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్, జూన్ 30: మండలంలోని వేదవతిహగరి నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. మండలంలోని కళ్లదేవనహళ్లి, సింగానహళ్లి, బొల్లనగుడ్డం తదితర గ్రామాల శివార్లలో ఉన్న నది నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. రెవెన్యూ, పోలీసు యంత్రాంగానికి ముడుపులు చెల్లిస్తూ ఇష్టానుసారంగా తరలిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీకి చెందిన మండల ప్రజాప్రతినిధి కనుసన్నల్లో వ్యాపారం జోరుగా సాగుతోందన్న విమర్శలు వ్యక్తం మవుతున్నాయి. ఉరవకొండ, గుంతకల్లు, బళ్లారి ప్రాంతాలకు తరలించే వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కేవైసీ చేసుకోండి

గుంతకల్లుటౌన్, జూన్ 30: పట్టణంలోని గుంతకల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో రుణాలు పొందిన సభ్యులు కేవైసీ చేసుకోవాలని ఆ సంఘం సీఈఓ కుల్లాయి పీరా ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. రుణాలు పొందిన సభ్యులు కేవైసీ చేసుకునేందుకు ఆధార్, రేషన్‌కార్డు, ఫోన్ నంబర్, పాన్‌కార్డు, ఓటరు కార్డు జిరాక్స్ కాపీలు, 3 పాస్ ఫొటోలు, నామినీతో సహకార సంఘంలో అందజేయాలని ఆయన కోరారు.

ప్రజలతో మమేకమయ్యేందుకే మన్‌కీ బాత్

తాడిపత్రిటౌన్, జూన్ 30: దేశ ప్రజలతో మమేకమై వారి కష్టసుఖాలు తెలుసుకోవడానికే భారత ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీబాత్ కార్యక్రమం చేపట్టారని బీజేపీ లీగల్‌సెల్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన నివాసంలో మన్‌కీబాత్ కార్యక్రమాన్ని టీవీ ద్వారా బీజేపీ నాయకులు వీక్షించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంకాల్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ రంగనాథ్‌రెడ్డి, నాయకులు గంగాధర్‌యాదవ్, ఆదిశేషారెడ్డి, వెంకటరామిరెడ్డి, చెన్నా రంగనాయకులు, నరసింహారెడ్డి, ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ సరఫరా వేళల్లో మార్పు

యల్లనూరు, జూన్ 30: మండలంలో వ్యవసాయ విద్యుత్ వేళల్లో మార్పులు చేస్తున్నట్లు ఏఈ పద్మనాభరెడ్డి తెలిపారు. యల్లనూరు సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు వ్యవసాయానికి విద్యుత్ సరఫరా అందిస్తున్నట్లు తెలిపారు.

టీమిండియా గెలుపుపై సంబరాలు


చిన్నారులతో కేక్ కట్ చేయిస్తున్న క్రీడాకారులు

కణేకల్లు, జూన్ 30: టీ 20 ప్రపంచ కప్‌లో భారత్ జట్టు విజేతగా నిలవడంపై క్రీడాకారులు సంబరాలు జరుపుకున్నారు. ఆదివారం చిక్కణ్ణేశ్వరసర్కిల్ వద్ద క్రీడాకారులు వేలూరు మరియప్ప, షేక్‌హుస్సేన్, టీటీ రమేష్, పురుషోత్తం, గోవర్ధన్‌తో పాటు పలువురు కేక్ కట్ చేసి భారత్ గెలుపుపై హర్షం వ్యక్తం చేశారు. 17 ఏళ్ల తర్వాత టీం ఇండియా టీ 20లో జగజ్జేతగా నిలవడం ఆనందంగా ఉందన్నారు. అహ్మద్, రాయల్ ప్రసాద్, ఇలియాజ్, ఖాలీద్, అరుణ్, వినోద్, రాజశేఖర్, సోహెల్, మణికంఠ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రధాన ఎజెండా


మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి మహబూబ్ బాషా

కుందుర్పి, జూన్ 30: గ్రామాల అభివృద్ధి ప్రధాన ఏజెండా అని పంచాయతీ కార్యదర్శి మహబూబ్ బాషా అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ ఆవరణలో సర్పంచ్ మారుతేశ్వరి ఆధ్వర్యంలో గ్రామసభను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా ప్రణాళికలను సిద్ధం చేసుకుని, ఇందులో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. మాజీ సర్పంచ్ పెద్ద నరసింహప్ప, మాజీ ఎంపీటీసీ మల్లికార్జున, టీడీపీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పింఛన్ల పెంపు టీడీపీతోనే సాధ్యం

కణేకల్లు, జూన్ 30: రాష్ట్ర చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం చంద్రబాబునాయుడు వృద్ధులు, వికలాంగులు, వితంతువుల జీవితాల్లో వెలుగులు నింపారని టీడీపీ క్లస్టర్ కన్వీనర్ ఉడేగోళం మారుతి అన్నారు. ఆదివారం స్థానిక ఆంజనేయస్వామి కట్ట వద్ద పింఛన్‌దారులతో సమావేశమయ్యారు. ఎన్నికల్లో చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు రూ.4 వేలతో పాటు మూడు మాసాలకు మరో రూ.3 వేలు అదనంగా ఇవ్వడం టీడీపీకే సాధ్యమన్నారు. నాయకులు శివశంకర్, రామాంజనేయులు, అనిల్, దేవేంద్ర, హనుమంతరాయుడు, పోతప్ప, ఆలీఖాన్ పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: పట్టణంలోని పాతకోటలో ఆదివారం పింఛన్లపై సచివాలయ సిబ్బందికి టీడీపీ నాయకులు అవగాహన కల్పించారు. సోమవారం జరగనున్న పింఛన్ల పంపిణీలో పెంచిన పింఛన్ మొత్తం రూ.4వేలతో పాటు మూడునెలలకు సంబంధించి రూ.3వేలు కలుపుకొని మొత్తం రూ.7వేలు అందించనున్నట్లు తెలిపారు. టీడీపీ, జనసేన నాయకులు బషీర్, ఉస్మాన్, హాజి, నాగరాజు, రసూల్, శ్రీహరి, ధనుంజయ్ పాల్గొన్నారు.


తాడిపత్రిలో లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న టీడీపీ నాయకులు

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలోని సచివాలయంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ అచ్యుతానంద బాబు ఆధ్వర్యంలో సోమవారం నుంచి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి, కూటమి నాయకలుఉ పాల్గొన్నారు.

గుత్తి రూరల్: ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని 24 పంచాయితీల్లో ఆదివారం ఎంపీడీఓ శ్రీనివాసులు గ్రామ సభలు నిర్వహించారు. ఆయన మాట్లడుతూ మండలంలో 6237 పింఛన్లు ఉన్నాయని రూ.4.18 కోట్లను సోమవారం ఉదయం 6 గంటల నుంచి లబ్ధిదారుల ఇంటివద్దకే వెళ్లి అందజేయాలన్నారు. సర్పంచ్ భరత్, రవితేజ నారాయణస్వామి, ఎంపీటీసీ నారాయణస్వామి, ఇషాక్, మాజీ సర్పంచు లక్ష్మీనారాయణమ్మ, సూరీ పాల్గొన్నారు.

పుట్లూరు: మండలంలో సోమవారం నిర్వహించే పింఛన్ల పంపిణీకి టీడీపీ నాయకులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు హాజరై విజయవంతం చేయాలని ఆదివారం ఆ పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్ నాయుడు, మండల కన్వీనర్ బాలరంగయ్యలు ఒక ప్రకటనలో కోరారు. ఆయా గ్రామాల్లో అధికారులకు చేదోడుగా ఉంటూ వృద్ధులకు పింఛన్ డబ్బులు అందించాలని కోరారు.